ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
7
శ్రీకాకుళం
జిల్లా వార్తలు
గురువారం 16 అక్టోబరు 2025



2న ఆదిత్యుని తెప్పోత్సవం

అరసవల్లి, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి):సూర్యనారాయణ స్వామి తెప్పోత్సవం నవంబరు 2న వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో కేఎస్‌వీడీవీ ప్రసాద్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ద్వాదశి పర్వదినాన ఆదిత్యుడు, ఉషా, ఛాయ, పద్మినీ సమేత దేవేరులను ప్రత్యేకంగా అలంకరించి ఊరేగింపుగా ఇంద్రపుష్కరిణి వద్దకు తీసుకువెళ్తామన్నారు. అక్కడ రమణీయంగా అలంకరించిన హంస వాహనంపై ఉత్సవమూర్తులను కొలువు దీర్చి, పుష్కరిణిలో విహరింపజేస్తామని చెప్పారు. ఈ దృశ్యాన్ని తిలకించేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని కోరారు.



సహజవాయువు ప్రాజెక్టు నేడు జాతికి అంకితం

- శ్రీకాకుళం నుంచి ఒడిశా వరకు పైపులైన్ పూర్తి
- రూ.1,730 కోట్లతో నిర్మాణం
- కర్నూలు నుంచి ప్రారంభించనున్న ప్రధాని మోదీ

శ్రీకాకుళం, అక్టోబరు 15 (ఆంధ్ర జ్యోతి): దేశంలో సహజవాయువు గ్రిడ్‌ను మరింత శక్తివంతం చేసేందుకు, ఆంధ్రప్రదేశ్-ఒడిశా రాష్ట్రాల్లో గ్యాస్ సరఫరాను పెంచేందుకు కేంద్ర ప్రభుత్వ సంస్థ గెయిల్ ఆధ్వ ర్యంలో చేపట్టిన శ్రీకాకుళం-అంగుల్ సహజవాయువు ప్రాజెక్టు నిర్మాణం పూర్తయింది. ఈ ప్రాజెక్టు ను ప్రధానమంత్రి నరేంద్రమోదీ.. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడితో కలసి గురువారం కర్నూలు నుంచి ప్రారంభించి జాతికి అంకితం చేయనున్నారు.


రూ. 1,730 కోట్లతో నిర్మాణం..

ఈ ప్రాజెక్టుకు రూ.1,730 కోట్ల వ్యయం చేశారు. కాకినాడ-శ్రీకాకుళం పైపులైన్లతో ఒడిశా (అంగుల్) వద్ద గెయిల్ సంస్థ సహకారంతో జగదీశ్‌పూర్-హల్దియా-బొకారో-ధమ్రా ప్రాజెక్టు కనెక్ట్ అయ్యేలా ప్రాజెక్టును రూపొందించారు. శ్రీకాకుళం జిల్లా నుంచి అంగుల్ వరకు సుమారు 422 కిలోమీటర్ల పొడవునా నాచురల్ గ్యాస్ పైప్‌లైన్-ఎస్‌ఏపీఎల్ నిర్మాణం జరిగింది. జిల్లాలో పైపులైన్ల ఏర్పాటులో కాస్త ఇబ్బందులు ఎదురైనా వాటిని అధిగమించారు. ఆంధ్రప్రదేశ్‌లో 124 కిలోమీటర్లు.. ఒడిశా లో 298 కిలోమీటర్ల పరిధిలో పైపులైన్లు ఉంటాయి. శ్రీకాకుళం నుంచి బరంపురం వరకు రోజుకి ఐదు మిలియన్ మెట్రిక్ స్టాండర్డ్ క్యూబిక్ మీటర్(ఎంఎంఎస్‌సీఎండీ), అలాగే బరంపురం నుంచి అంగుల్ వరకు 4.5 ఎంఎంఎస్‌సీఎండీ కెపాసిటీగా నిర్దేశించారు. వాస్తవంగా ఈ ప్రాజెక్టును డిసెంబర్ నాటికి పూర్తవుతుందని అంచనావేశారు. కానీ కాస్త ముందుగానే సిద్ధంచేయడంతో నేడు ప్రారంభానికి నోచుకుంది.

పారిశ్రామిక అభివృద్ధికి దోహదం..

గ్యాస్ గ్రిడ్ విస్తరణలో భాగంగా ఈ పైపులైన్ నిర్మాణం జరిగింది. ఆంధ్ర-ఒడిశా ప్రాంతాల్లో గ్యాస్ సరఫరా మరింత వీలుగా ఉంటుంది. అవసరమైన పరిశ్రమలకు గ్యాస్ సరఫరాకు అవకాశం ఏర్పడింది. అల్యూమినియం, బాక్సైట్, విద్యుత్ ఉత్పత్తి, రసాయన పరిశ్రమలు.. ఇవన్నీ గ్యాస్ ఆధారిత ఇంధనాన్ని ఉపయోగిస్తున్నాయి. గ్యాస్ గ్రిడ్ విస్తరణ వల్ల రెండు రాష్ట్రాల్లో పారిశ్రామిక అభివృద్ధితోపాటుగా ఫ్యూయల్ ఖర్చుల తగ్గింపు సాధ్యమవుతుంది. అన్నింటికంటే ఇళ్లకు, కమర్షియల్ యూనిట్లు, వంట గ్యాస్, వాహన ఇంధనం వంటి వివిధ అవసరాలకు గ్యాస్ సమకూర్చే అవకాశం ఉంటుంది. అలాగే లక్షల మందికి ఉపాధి కలగనుంది. ఈ ప్రాజెక్టు పర్యావరణ అభివృద్ధికి దోహదపడుతుంది. పెట్రోల్, డీజిల్ కంటే తక్కువ కర్బన ఉద్గారాలు విడుదల చేస్తుంది.

వెన్ను.. దన్ను



- శరీరంలో అదే కీలకం
- నేడు ప్రపంచ వెన్నెముక దినోత్సవం

అరసవల్లి, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): మనిషి శరీరానికి వెన్నెముకే ప్రధానం. ఇది కేవలం శరీరాన్ని నిలబెట్టడమే కాకుండా నాడీ వ్యవస్థకు రక్షణ కల్పించి... ప్రతి కదలికకూ ఆధారం అవుతుంది. ప్రతి శ్వాసలో, అడుగులో వెన్నెముక పాత్ర ఉంటుంది. మన శరీరానికి పునాది లాంటిది వెన్నెముక. ఇది 33 ఎముకలతో కూడి ఉంటుంది. ఇది మెడ నుంచి తుంటి వరకూ విస్తరించి... నాడులను రక్షిస్తుంది. వంగడం, నిలబడడం, కూర్చోవడం, నడవడం ఇవన్నీ వెన్నెముక సమతౌల్యత వల్లనే సాధ్యమవుతాయి.

ఇవీ కారణాలు

ప్రస్తుత యాంత్రిక జీవనశైలి. వ్యాయామం లేకపోవడం... ఎక్కువ సేపు కంప్యూటర్ల ముందు కూర్చొని... విధులు నిర్వహించడం వల్ల వెన్నెముక వ్యాధులు వేగంగా పెరుగుతున్నాయి. ముఖ్యంగా ఉద్యోగాల్లో రోజుకు 8 నుంచి 10 గంటల పాటు కంప్యూటర్ల ముందు కూర్చోవడం వల్ల వెన్నునొప్పి... డిస్క్ సమస్యలు వస్తున్నాయి. మొబైల్, ల్యాప్‌టాప్‌లు చూస్తూ వంగి కూర్చోవడం... వెన్నెముకను బలపరిచే యోగాసనాలు, నడక వంటి శారీరక వ్యాయామం లేకపోవడం... అధిక బరువు, పోషకాహార లోపం వంటి కారణాలు వెన్నెముకపై తీవ్ర ప్రభావం చూపుతాయి.



సమస్యలు ఇవే..

హెర్నియేటెడ్ డిస్కులు..

వెన్నుపూసల మధ్య కుషనింగ్ డిస్కులు ఉబ్బినప్పుడు, చీలిపోయినప్పుడు, వెన్నెముక నరాలపై ఒత్తిడి తెచ్చి తీవ్రమైన నొప్పి, తిమ్మిరిని కలిగిస్తాయి.

డీజనరేటివ్ డిస్క్ వ్యాధి..

డిస్కులు హైడ్రేషన్, ఫ్లెక్సిబులిటీ కోల్పోయినప్పుడు తరచుగా దీర్ఘకాలిక నొప్పికి దారితీస్తుంది.

స్కోలియోసిస్..

పిల్లల్లో వెన్నెముక ఆరోగ్యాన్ని ప్రభావితం చేస్తుంది. పార్శ్వ గూని అనేది వెన్నెముక వక్రత, అసౌకర్యం, భంగిమ వంటి సమస్యలకు దారితీస్తుంది. ముఖ్యంగా కౌమారదశలో ఉన్న వారిని కూడా ప్రభావితం చేస్తుంది.

స్పైనల్ స్టెనోసిస్..

ఇది ఎక్కువగా వృద్ధుల్లో కనిపిస్తుంది. వయస్సు సంబంధిత క్షీణత కారణంగా వెన్నెముక (మిగతా 9వ పేజీలో..)



గూగుల్ రాకపై సంబరాలు
- బాణసంచా కాల్చి టీడీపీ నాయకుల సందడి 8

ఎక్కువ మాట్లాడితే దరువులు తప్పవు
- వైస్ ఎంపీపీని హెచ్చరించిన తహసీల్దార్ 8

ఫొటోషూట్‌కు వెళుతూ..
- రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి 8

టెక్కలి ట్రైబల్ వెల్ఫేర్ హాస్టల్ విద్యార్థినుల థింసా నృత్యం

భళా.. భళా!

అరసవల్లి, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): 'సూపర్ జీఎస్టీ.. సూపర్ సేవింగ్స్' కార్యక్రమంలో భాగంగా స్థానిక ఎన్టీఆర్ మున్సిపల్ మైదానంలో బుధవారం సిక్కోలు ఉత్సవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా నీరజ సుబ్రహ్మణ్యం బృందం సాంప్రదాయ నృత్య ప్రదర్శనలు ఆహూతులను ఆకట్టుకున్నాయి. టెక్కలి ట్రైబల్ వెల్ఫేర్ పోస్ట్ మెట్రిక్ హాస్టల్‌బాలికల థింసా నృత్యాలు కూడా రంజింపజేశాయి.

న్యాయమైన బెయిల్‌కు సహకారం అందించాలి

శ్రీకాకుళం లీగల్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని జైలు ముద్దాయిలకు అండర్ ట్రైల్ సమీక్ష కమిటీలో చర్చించి బెయిల్‌కు సహకరించాలని జిల్లా ప్రధాన న్యాయాధికారి జునైద్ అహ్మద్ మౌలానా సూచించారు. జిల్లా న్యాయస్థానంలో పోలీసు అధికారులు, న్యాయ వాదులు, అండర్ ట్రైల్ సమీక్ష కమిటీ సభ్యులతో బుధవారం సమావేశం నిర్వహించారు. అనారోగ్యంతో బాధపడుతున్న ముద్దాయిలు, మహిళా ముద్దాయిల పరిస్థితిని కమిటీ సభ్యులు చర్చించి త్వరితగతిన బయటకు పంపించడంలో ప్రయత్నించాలన్నారు. సమా వేశంలో ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి, న్యాయాధికారులు పి.భాస్కరరావు, వివేకానంద శ్రీనివాస్, ఎస్ఎం ఫణికుమార్, కె.హరిబాబు, ఎం. శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయాధికారి మౌలానా, పాల్గొన్న ఎస్పీ, న్యాయాధికారులు



సర్వేను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ అనిత

కృష్ణాపురంలో కిడ్నీవ్యాధి పరీక్షలు చేస్తాం

- డీఎంహెచ్‌వో అనిత

పొందూరు, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): కృష్ణాపురం గ్రామంలో కిడ్నీవ్యాధి నిర్ధారణకు రక్తపరీక్షలతో పాటు సంపూర్ణ వైద్య పరీక్షలు నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటామని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ అనిత తెలి పారు. 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన 'ఆ గ్రామానికి ఏమైంది' కథనంపై ఆమె స్పందించారు. ఈ మేరకు బుధవారం కృష్ణాపురంలో వైద్య సిబ్బందితో కలిసి ఆమె సర్వే నిర్వహించారు. గ్రామంలో కిడ్నీ వ్యాధి ప్రబలడానికి కారణాలు తెలుసుకోవాలని, బాధితులను గుర్తించడానికి వైద్య పరీక్షలు నిర్వహించాలని గ్రామస్థులు కోరారు. గ్రామంలో తాగునీటి వనరులను పరీక్షిస్తామని, ఇతర కారణాలపైనా దృష్టి పెడతామని ఆమె హామీ ఇచ్చారు. వ్యాధి అదుపులోకి వచ్చేంత వరకు వైద్య శిబిరాలు నిర్వహించాలని తాడివలస పీహెచ్‌సీ సిబ్బందిని ఆదేశించారు.

డిసెంబరు నాటికి సమీకృత కలెక్టరేట్

- కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్



సమీకృత కలెక్టరేట్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

శ్రీకాకుళం కలెక్టరేట్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): సమీకృత కలెక్టరేట్ భవనాన్ని ఈ డిసెంబరు నాటికి పూర్తి చేయాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్‌తో కలిసి ఆయన ఇంటిగ్రేటెడ్ కలెక్టరేట్‌ను బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ శాఖలన్నీ ఇంటిగ్రేటెడ్ కలెక్టరేట్‌లోనే ఉండాలని, అవసరాలను బట్టి కేటాయింపు చర్యలు చేపట్టాలని డీఆర్వో, ఏవోలను ఆదేశించారు. ప్రజోపయోగ శాఖలను కింది అంతస్థులోనే ఉండేటట్లు చూడాలని అన్నారు. బయట చిన్న షాపులు పెట్టుకునే విధంగా స్టాల్స్ ఏర్పాటు చేయాలని, ప్రవేశ ద్వారం పెద్దదిగా ఉండాలని, అక్కడి గోడలకు రంగులు వేయాలని చెప్పారు. లోపలి వైపు లాన్‌లో నీరు నిల్వ ఉండడానికి వీల్లేదన్నారు. అన్ని ఫ్లోర్లలోని గదులను పరిశీలించి జేసీతో చర్చించారు. స్టాఫ్ క్యాంటీన్‌కు కేటాయించిన గదిని పరిశీలించారు. ప్రవేశ ద్వారానికి సంబంధించిన (మిగతా 8వ పేజీలో..)

విలాసాలకు అలవాటుపడి..

- ఖరీదైన బైక్‌ల దొంగతనం
- ముగ్గురు యువకుల అరెస్టు
- ఏడు వాహనాలు స్వాధీనం



స్వాధీనం చేసుకున్న వాహనాలను పరిశీలిస్తున్న ఏఎస్పీ తదితరులు

శ్రీకాకుళం రూరల్, అక్టోబరు15 (ఆంధ్రజ్యోతి): విలాసవంతమైన జీవితానికి అలవాటు పడిన ముగ్గురు యువకులు దొంగలుగా మారారు. ఖరీదైన బైక్‌లను చోరీచేసి వాటిని విక్రయించి జల్సాలు చేసేవారు. పోలీసులు చేపట్టిన వాహన తనిఖీల్లో వీరు పడ్డారు. ముగ్గురిని అరెస్టు చేసి వారినుంచి ఏడు రాయల్ ఎన్‌ఫీల్డ్ బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. ఈ వివరాలను శ్రీకాకుళం రూరల్ పోలీసు స్టేషన్‌లో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో అదనపు ఎస్పీ పి.శ్రీనివాసరావు వెల్లడించారు. దండు రిషివర్ధన్, రాయిపల్లి వినోద్, చిట్టి సంతోష్ అనే ముగ్గురు యువకులు రెండు బైక్‌లపై ఆమదాలవలస నుంచి శ్రీకాకుళం వైపు వస్తుండగా దూసి కూడలి వద్ద రూరల్ ఎస్ఐ కె.రాము వారి వాహనాలను ఆపి తనిఖీ చేశారు. సరైన పత్రాలు లేకపోవడంతో వారిని అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు. దీంతో వాహనాలను దొంగతనం చేసినట్లు వారు చెప్పారు. విలాసవంతమైన జీవితానికి అలవాటు పడి తాము ఇటువంటి దొంగతనాలకు పాల్పడినట్లు అంగీకరించారు. వారి నుంచి రూ.14 లక్షల విలువ గల ఏడు రాయల్ ఎన్‌ఫీల్డ్ మోటార్ సైకిళ్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అనంతరం వారిని అరెస్టు చేసి కోర్టులో ప్రవేశపెట్టారు.

నిందితులపై అనేక కేసులు..

రిషి వర్ధన్‌పై విశాఖపట్నం పీఎం పాలెం పోలీస్ స్టేషన్‌లో ఒక హత్య కేసు, పార్వతీపురం రూరల్ పోలీసు స్టేషన్‌లో చీటింగ్ కేసు నమోదై ఉన్నాయి. వినోద్‌పై సాలూరు పోలీసు స్టేషన్‌లో ఐదు సారా కేసులు, సాలూరు ఎక్సైజ్ స్టేషన్‌లో ఒక సారా కేసు, గంట్యాడ పోలీస్ స్టేషన్ పరిధిలో ఒక కేసు ఉంది. జైలులో వీరిద్దరికి ఏర్పడిన పరిచయం స్నేహంగా మారి దొంగతనాలకు దారి తీసిందని పోలీసులు తెలిపారు. సంతోష్ కొత్తూరు పట్టణంలో సెకెండ్ హ్యాండ్ బైక్ షోరూమ్ నిర్వహిస్తున్నాడు. ఈ ముగ్గురూ కలిసి రాయల్ ఎన్‌ఫీల్డ్ బైక్‌లను దొంగతనం చేసి, వాటి నెంబరు ప్లేట్లు మార్చి ఇతరులకు విక్రయించేవారు. ఈ కేసును చాకచక్యంగా ఛేదించేందుకు కృషి చేసిన శ్రీకాకుళం డీఎస్పీ వివేకానంద, రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ పైడిపునాయుడు, ఎస్ఐ కె.రాము, నారాయణరావు, హెడ్ కానిస్టేబుల్ కృష్ణమూర్తిని ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి అభినందించారు.

సీదిరి సార్.. ఏంటీ వ్యాఖ్యలు?

- ఎస్పీపై నోరుపారేసుకున్న మాజీ మంత్రి
- కాశీబుగ్గ సీఐపైనా అనుచిత వ్యాఖ్యలు
- కార్యకర్తను విడిపించడానికి అర్ధరాత్రి హైడ్రామా

పలాస, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డిపై మాజీ మంత్రి, పలాస వైసీపీ సమన్వయకర్త సీదిరి అప్పలరాజు నోరుపారేసుకున్నారు. కాశీబుగ్గ సీఐ పి.సూర్యనారాయణపై కూడా అనుచిత వ్యాఖ్యలు చేశారు. తమ పార్టీ కార్యకర్తను విడిపించడం కోసం మంగళవారం అర్ధరాత్రి దాటిన తరువాత కాశీబుగ్గ పోలీసు స్టేషన్‌కు కార్యకర్తలతో వచ్చి ఆయన హైడ్రామా సృష్టించారు. వైసీపీ ఇటీవల నకిలీ మద్యంపై చేపట్టిన ఆందోళన కార్యక్రమంలో ఆ పార్టీ కార్యకర్త వేణుగోపాల రెడ్డి ఓ మహిళా కానిస్టేబుల్ పట్ల అసభ్యకరంగా వ్యవహరించిన ఘటన సోషల్ మీడియాలో వైరల్ అయింది. దీంతో మంగళవారం రాత్రి ఆయన్ను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించారు. ఈ విషయం తెలుసుకున్న మాజీ మంత్రి అప్పలరాజు తమ కార్యకర్తలతో కాశీబుగ్గ పోలీసు స్టేషన్‌కు చేరుకుని ఆందోళన చేపట్టారు. తప్పు చేయని వారిని స్టేషన్‌కు ఎలా తీసుకు వస్తారని ఎస్పీపై చిందులు తొక్కారు. యూట్యూబ్‌లో ఉన్న వీడియోలు ప్రదర్శిస్తూ సీదిరి ఆగ్రహం వ్యక్తం చేశారు. 'సీఐ సూర్యనారాయణ మహిళల పట్ల (మిగతా 8వ పేజీలో..)



కాశీబుగ్గ పోలీసు స్టేషన్ వద్ద బైఠాయించి నిరసన వ్యక్తం చేస్తున్న మాజీ మంత్రి అప్పలరాజు (వృత్తంలో)

పార్వతీపురంలో ఫొటోషూట్‌కు వెళ్తూ..

● రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

ఆమదాలవలస, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): బూర్జ మండలం నీలంపేట జంక్షన్ వద్ద బుధవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో కె.సంతోష్ (19) మృతి చెందినట్టు బూర్జ పోలీసులు తెలిపారు. ఆ వివరాలిలా ఉన్నాయి.. విజయనగరం జిల్లా గరివిడి మండలం పేరిపేట గ్రామానికి చెందిన సంతోష్ తన స్నేహితుడు, గాజువాకకు చెందిన నమ్మి కనకరాజుతో కలిసి ద్విచక్ర వాహనంపై శ్రీకాకుళం నుంచి పార్వతీపురం వెళుతున్నాడు. ఫొటోగ్రాఫర్లు అయిన వీరు పార్వతీపురంలో ఓ ఫొటోషూట్ కోసం వెళ్తుండగా.. నీలంపేట జంక్షన్ వద్ద ప్రధాన రహదారిలో ఉన్న గోతులు తప్పించబోయి బైక్ అదుపు తప్పి పడిపోయారు. ద్విచక్ర వాహనం నడుపుతున్న సంతోష్ అక్కడికక్కడే మృతి చెందగా.. వెనుక కూర్చున్న కనకరాజుకు తీవ్రంగా గాయపడ్డాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం శ్రీకాకుళం రిమ్స్‌కి తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతూ విద్యార్థిని మృతి

రణస్థలం, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): సంచాం గ్రామానికి చెందిన ఎం.భాగ్యశ్రీ (14) ఆసుపత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందినట్టు ఎస్‌ఐ చిరంజీవి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. భాగ్యశ్రీ తల్లి ఏడాది కిందట మృతి చెందింది. దీంతో భాగ్యశ్రీ కొన్నాళ్లగా మానసికంగా ఇబ్బంది పడుతుంది. ఈ నేపథ్యంలో ఆదివారం గడ్డిమందు తాగింది. వెంటనే స్థానికులు ఆమెను విజయనగరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందింది. భాగ్యశ్రీ ఒక ప్రైవేటు పాఠశాలలో 9వ తరగతి చదువుతోంది. తండ్రి ఎం.రమణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

పోక్సో కేసు నమోదు

రణస్థలం, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలిక కిడ్నాప్‌పై బుధవారం పోక్సో కేసు నమోదు చేసినట్టు జేఆర్ పురం ఎస్‌ఐ ఎస్.చిరంజీవి తెలిపారు. వివరాలిలా ఉన్నాయి.. ఆ బాలికను మైలపల్లి రాజ్‌కుమార్ ఈనెల 4న కిడ్నాప్ చేశాడు. బాలిక తల్లి లక్ష్మీ ఫిర్యాదు మేరకు రాజ్‌కుమార్‌ను పట్టుకుని పోక్సో కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్టు తెలిపారు.

బంగారం పుస్తెలతాడు చోరీ

సంతబొమ్మాళి, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): బోరుభద్ర గ్రామానికి చెందిన మార్పు అప్పన్నమ్మ మెడలోని రెండు తులాల బంగారం పుస్తెలతాడు చోరీ జరిగిందని ఎస్‌ఐ వై.సింహాచలం తెలిపారు. ఎస్‌ఐ తెలిపిన వివరాల మేరకు.. బుధవారం ఉదయం అప్పన్నమ్మ తన కన్నవారి ఇళ్లైన మండలంలోని నగిరిపెంటకు వెళ్లింది. తిరిగి పది గంటల సమయంలో స్వగ్రామానికి వచ్చేందుకు నగిరిపెంట జంక్షన్ వద్ద వేచి ఉన్న సమయంలో గుర్తుతెలియని ఇద్దరు వ్యక్తులు ద్విచక్ర వాహనంపై వచ్చి ఆమె మెడలోని పుస్తెలతాడు తెంపి పారిపోయారు. ఆమె ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

మెళియాపుట్టి, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): చాపర వద్ద బుధవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి గాయపడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. నందిగాం మండలం అన్నాపురం గ్రామానికి చెందిన పాల్గొణరావు చాపర నుంచి పట్టుపురం వైపు ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా.. ఎదురుగా వస్తున్న కారు ఢీకొనడంతో గాయపడ్డాడు. ప్రమాదం జరిగిన వెంటనే 108 వాహనం ద్వారా టెక్కలి జిల్లా ఆసుపత్రికి తరలించారు. దీనిపై ఎస్‌ఐ రమేష్‌బాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వినియోగదారులను మోసగిస్తే చర్యలు

పలాస రూరల్, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): వినియోగదారులకు మోసగిస్తే చర్యలు తప్పవని తూనికల, కొలతల ఇన్‌స్పెక్టర్ బలరామకృష్ణ అన్నారు. పలాస మండలం, పట్టణంలో ఆయన బుధవారం వివిధ షాపుల్లో ఆకస్మిక తనిఖీలు చేపట్టి తూనికలు, కొలతల్లో గల తేడాలను పరిశీలించారు. చికెన్, మటన్ షాపుల్లోని కాటాలను తనిఖీ చేసి, మోసాలను గుర్తించి కేసులు నమోదు చేశారు. క్రాకర్ షాపును పరిశీలించి తేడాలున్నవాటిపై వివరాలను సేకరించారు. చేపల మార్కెట్‌లో తేడాలు అధికంగా ఉన్నందున వినియోగదారులకు మోసగిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. టెక్నీషియన్ నర్సింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.


మద్యం నాణ్యత తనిఖీకి సురక్ష యాప్


సీల్‌ను పరిశీలిస్తున్న ఎక్సైజ్‌శాఖ అధికారులు

నరసన్నపేట, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): మద్యం నాణ్యత సురక్ష యాప్ ద్వారా తెలుసుకోవచ్చునని ఎక్సైజ్ సీఐ నీలవేణి, ఎస్‌ఐ గురుమూర్తి అన్నారు. బుధవారం పట్టణంలో పలు మద్యం షాపుల్లో మద్యం నాణ్యతలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మొబైల్‌లో సురక్ష యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకొని మద్యం సీసా మూతకి అతికించిన సీల్ పై ఉన్న క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేస్తే.. ఆ సీసా ఎక్కడ తయారైంది.. ఏ డిపో నుంచి సరఫరా చేశారు.. ఏ షాపుల్లో కొనుగోలు చేశారో వంటి వివరాలు తెలుస్తాయన్నారు. అనుమానం వస్తే 14405 టోల్‌ఫ్రీ నెంబరుకు సమాచారం ఇవ్వాలన్నారు.

● టెక్కలి, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): మద్యం నాణ్యత ప్రమాణాలను మొబైల్ యాప్ ద్వారా తెలుసుకోవచ్చునని టెక్కలి ఎక్సైజ్ సీఐ మీరా సాహిబ్ తెలిపారు. సురక్ష అనే యాప్ ద్వారా క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి మద్యం వివరాలు అందుబాటులోకి వస్తాయన్నారు. ఎక్కడైనా అనుమానం ఉంటే 14405 టోల్‌ఫ్రీ నెంబరుకు సమాచారం ఇవ్వాలని సూచించారు.

ప్రథమ చికిత్సపై విద్యార్థులకు అవగాహన



అవగాహన కల్పిస్తున్న దృశ్యం

కాశీబుగ్గ, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): సూర్యతేజ కళాశాల విద్యార్థులకు రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో ప్రథమ చికిత్స, అత్యవసర పరిస్థితుల్లో మనం ఏవిధంగా స్పందించాలో వైద్యశాస్త్రంలోని కొన్ని సూచనలు అందించారని ప్రిన్సిపాల్ దానేటి పద్మజీ కామేశ్వరరావు అన్నారు. బుధవారం కళాశాలలో రెడ్‌క్రాస్ ప్రోగ్రాం మేనజర్ కె.సత్యనారాయణ విద్యార్థులకు ప్రయోగపూర్వకంగా చేసి వివరించారు. పక్కవారు గాని ప్రాణపాయం నుంచి ఎలా కాపాడుకోవాలో సీపీఆర్ ఎలా చేయాలో వంటివాటిపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏపీవోఎస్ ఉమాశంకర్ పాల్గొన్నారు.

● పలాస, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గుండె, ఉపిరితిత్తుల పునఃప్రారంభంపై విద్యార్థులకు రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యులు బుధవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. రెడ్‌క్రాస్ జిల్లా మేనేజర్ కె.సత్యనారాయణ, ప్రిన్సిపాల్ కె.నర్సింహమూర్తి, ఎన్‌ఎస్‌ఎస్ పీవోలు కొండల మధుబాబు, వాసుదేవరావు, పాపారావు పాల్గొన్నారు.

● పాతపట్నం అక్టోబర్ 15(ఆంధ్రజ్యోతి): తెంబూరు ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాలలో వైద్యాధికారిణి ఎస్ ఉమాగౌరీ సీపీఆర్‌పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో గ్రామప్రజలు పాల్గొన్నారు.

సాగులో సూచనలు పాటించాలి

కోటబొమ్మాళి, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): వరి సాగులో ఎదురయ్యే పాముపొడ, సుడిదోమ తెగుళ్ల నివారణ అవసరమైన సూచనలు పాటించాలని రాగోలు వ్యవసాయ పరిశోధన శాస్త్రవేత్త ఆర్.ఉదయ్‌బాబు అన్నారు. బుధవారం ఆయన హరిశ్చంద్రపురంలోని వరి క్షేత్రాలను సందర్శించారు. వరి పొలంలో నీటిని తీసివేసి ఆరబెట్టి తర్వాత మళ్లీ నీరు పెట్టి కాలిబాటలు ఏర్పాటు చేయడం వల్ల దోమ ఉధృతి అరికట్టవచ్చునన్నారు. కార్యక్రమంలో టెక్కలి ఏడీవో కె.జగన్మోహన్‌రావు, ఏవో ఎస్.గోవిందరావు, రైతులు పాల్గొన్నారు.


నరసన్నపేట: టీడీపీ కార్యాలయం వద్ద సంబరాలు జరుపుకుంటున్న ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి తదితరులు


టెక్కలి: టీడీపీ కార్యాలయం ఎదుట బాణసంచా కాల్చుతున్న పార్టీ నాయకులు, కార్యకర్తలు

గూగుల్ రాకపై సంబరాలు

● బాణసంచా కాల్చుతూ జిల్లా టీడీపీ నేతల సందడి

గూగుల్ రాకతో విశాఖ పూర్తిస్థాయిలో డేటా హబ్‌గా మారనుందని, లక్షలాది మందికి ఉపాధి అవకాశాలు వస్తాయంటూ జిల్లా టీడీపీ నేతలు బుధవారం సంతోషం వ్యక్తం చేశారు. బాణసంచా కాల్చుతూ కూటమి నాయకులు సంబరాలు చేసుకున్నారు.

ముందే వచ్చిన దీపావళి: ఎమ్మెల్యే శిరీష

పలాస, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): విశాఖ కేంద్రంగా గూగుల్ సంస్థ ఏర్పాటు కానుండడంతో పలాస తెలుగుదేశం పార్టీ కార్యాలయం ఆవరణలో మంగళవారం రాత్రి బాణసంచా కాలుస్తూ సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గౌతు శిరీష మాట్లాడుతూ.. గుగూల్ సంస్థతో 15 బిలియన్ల డాలర్ల ఏ1 డేటా సెంటర్ నెలకొల్పడానికి ముఖ్యమంత్రి చంద్రబాబు, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ ఆ సంస్థతో ఒప్పందం కుదుర్చుకోవడం చారిత్రాత్మక విజయమన్నారు. నాటు హైదరాబాదులో హైటెక్ సిటీ నెలకొల్పి ప్రపంచంలో అగ్రగామిగా నిలిపారని, ప్రస్తుతం గుగూల్ ఏర్పాటు ద్వారా ప్రపంచంలో విశాఖ ప్రఖ్యాత కేంద్రంగా మారుతుందనడంలో సందేహం లేదన్నారు. అనంతరం బాణసంచా కాలుస్తూ సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో ఏపీ టీపీసీ చైర్మన్ వజ్జ బాబూరావు, పీరుకట్ల విఠల్‌రావు, గాలి కృష్ణారావు, లొడగల కామేశ్వరరావు యాదవ్, బడ్డ నాగరాజు, సప్ప నవీన్, జోగ మల్లి, గురిటి సూర్యనారాయణ పాల్గొన్నారు.

ఉత్తరాంధ్రకే మణిహారం: ఎమ్మెల్యే బగ్గు

నరసన్నపేట, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): విశాఖకు గూగుల్ డేటా సెంటర్ రాకతో రానున్న రోజుల్లో ఉత్తరాంధ్ర ప్రాంతవాసులకు లక్షలాది ఉద్యోగావకాశాలు రానున్నాయని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. బుధవారం రాత్రి స్థానిక టీడీపీ కార్యాలయ ఆవరణలో టీడీపీ నాయకులతో కలిసి సంబరాలు చేసుకున్నారు. ఉత్తరాంధ్ర అభివృద్ధికి సీఎం చంద్రబాబు, ఐటీశాఖ మంత్రి లోకేష్ చేస్తున్న కృషిని కొనియాడారు. నాడు హైదరాబాదును సైబరాబాదుగా తీర్చిదిద్దిన సీఎం చంద్రబాబు నేడు విశాఖను ఏఐ హబ్‌గా మారేందుకు పునాథులు వేశారన్నారు. కూటమి ప్రభుత్వం ఉత్తరాంధ్ర అభివృద్ధికి పెద్దపీట వేస్తుందన్నారు. బాణసంచా కాల్చి సంబరాలు నిర్వహించారు. టీడీపీ నాయకులు పాల్గొన్నారు.


పలాస: టీడీపీ కార్యాలయం వద్ద బాణసంచా కాల్చుతూ సంబరాలు జరుపుకుంటున్న ఎమ్మెల్యే గౌతు శిరీష, టీడీపీ నాయకులు

టెక్కలి టీడీపీ కార్యాలయం వద్ద..

టెక్కలి, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): విశాఖ కేంద్రంగా గూగుల్ సంస్థతో కూటమి ప్రభుత్వం ఒప్పందం కుదుర్చుకోవడంపై బుధవారం టెక్కలి టీడీపీ కార్యాలయం ఎదుట ఆ పార్టీ నాయకులు బాణసంచా కాల్చి సంబరాలు జరుపుకున్నారు. గత వైసీపీ ప్రభుత్వం దొంగ ఒప్పందాలు చేసుకొని నిరుద్యోగులకు ఒక్క ఉద్యోగమైనా ఇవ్వలేదన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఐటీ మంత్రి లోకేష్, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, మంత్రి అచ్చెన్నాయుడి కృషితో ఉత్తరాంధ్ర అభివృద్ధి చెందుతుందన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ బగాది శేశగిరావు, కె.లవకుమార్, దమయంతి, ప్రసాద్‌రెడ్డి, జి.సత్యం, త్రితిష్, మణి తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు పాలనలో ఐటీ అభివృద్ధి: అశోక్

కవిటి, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు పాలనతో రాష్ట్రంలో ఐటీ రంగం అభివృద్ధి దిశగా పయనిస్తోందని ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బెందాళం అశోక్ అన్నారు. రామయ్యపుట్టుగలో బుధవారం విలేకరులతో మాటాడుతూ.. విశాఖలో గూగుల్ సంస్థ ఏర్పాటుకు నిర్ణయించడంతో యువతకు మేలు జరుగుతుందన్నారు. విశాఖ ఏఐ సిటీగా మారితే రాష్ట్రం దేశానికే డిజిటల్ ఇండియాలో మార్గదర్శకంగా నిలుస్తుందన్నారు. విశాఖ కేంద్రంగా ఐటీ అభివృద్ధికి సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్ విశేషంగా కృషి చేస్తున్నారన్నారు. కార్య క్రమంలో టీడీపీ నేత బి.రమేష్, మత్స్యకార ప్రతినిధులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే బెందాళం అశోక్

హామీలు నెరవేర్చిన ఘనత కూటమిదే

పలాస, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఇచ్చిన హామీలు నెరవేర్చిన ఘనత కూటమి ప్రభుత్వానికే దక్కిందని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. బుధవారం ఆమె స్థానిక టీడీపీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ.. ఇప్పటికే సూపర్ సిక్స్ పథకాలు అమలు చేస్తూ ప్రభుత్వం సూపర్‌హిట్ అయిందని, కొత్తగా విశాఖను గుగూల్ సంస్థ తీసుకువచ్చి ప్రజలు చిరస్థాయిగా మరిచిపోలేని విధంగా కార్యక్రమాన్ని అమలు చేస్తోందన్నారు. ప్రభుత్వంపై నమ్మకంతో 164 సీట్లు గెలిపించిన ప్రజలకు సంక్షేమ పథకాలు అమలు చేసి ప్రతి విజయం మీ ముందుకు తీసుకువస్తున్నామన్నారు. రాష్ట్ర ప్రజలు చెప్పుకునే రీతిలో యువ నాయకులు నారా లోకేష్ సాధించిన ప్రపంచంలోనే అతిప్రతిష్ఠాత్మకమైన గుగూల్ సంస్థ విశాఖ రావడం గర్వంగా భావిస్తున్నామన్నారు. నియోజకవర్గంలో 116 మంది డీఎస్సీ ద్వారా ఉద్యోగాలు వచ్చాయని, వారందరి కళ్లల్లో ఆనందాన్ని చూసామన్నారు.

ఐతంలో ఎన్‌సీసీ క్యాడెట్ల ఎంపిక


ఎంపికైనవారిని అభినందిస్తున్న అధికారులు

టెక్కలి, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): టెక్కలి సమీపంలోని ఐతం ఇంజనీరింగ్ కళాశాలలో ఇంజనీరింగ్ విద్యార్థులకు ఎన్‌సీసీ క్యాడెట్స్ ఎంపికలు బుధవారం నిర్వహించినట్టు కళాశాల డైరెక్టర్ ప్రొఫెసర్ వీవీ నాగేశ్వరరావు తెలిపారు. 14ఆంధ్రా బెటాలియన్ కమాండెంట్ ఆఫీసర్ లెఫ్టనెంట్ కల్నర్ శాంక్ కుశ్వహ్, సెబేదార్ మేజర్ బల్వంత్ సింగ్, సెబేదార్ బగిచాసింగ్, సీహెచ్‌ఎం రవికృష్ణ, హవల్దార్ అన్నంప్రతాప్ రెడ్డి ఆధ్వర్యంలో ఈ ఎంపికలు జరిగాయన్నారు. 380మంది విద్యార్థులు పాల్గొనగా 77మంది ఎంపికైనట్టు తెలిపారు. ప్రిన్సిపాల్ ఏఎస్ శ్రీనివాసరావు, ఎన్‌సీసీ కోఆర్డినేటర్ డి.విష్ణుమూర్తి, అసోసియేట్ ఎన్‌సీసీ ఆఫీసర్, శిక్షణాధికారులు ఎన్.భుజంగరావు, ఎస్.రామయ్య, డీన్‌లు, హెచ్‌వోడీలు పాల్గొన్నారు.

పాఠశాల స్థాయి కొనసాగించడంపై హర్షం

మందస/హరిపురం, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): మందస మండలం హొన్నాళి ప్రాథమికోన్నత పాఠశాల స్థాయిని యథావిధిగా కొనసాగించడంపై ఆ గ్రామస్థులు, యూటీఎఫ్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. రేషనలైజేషన్‌లో భాగంగా పాఠశాల స్థాయి తగ్గించి ప్రాథమిక పాఠశాలగా ప్రభుత్వం మార్పు చేశారు. దీంతో గ్రామస్థులు, పలు ఉపాధ్యాయ సంఘాలు ఆందోళన వ్యక్తం చేశాయి. ఈ విషయాన్ని ఎమ్మెల్యే శిరీష మంత్రి నారా లోకేష్ దృష్టికి తీసుకెళ్లడంతో పాఠశాల స్థాయి యథావిధిగా కొనసాగించేలా బుధవారం ఉత్తర్వులు అందాయి. యూటీఎఫ్ నాయకులు లండ బాబూరావు, కంచరాన మాధవరావు, గున్న రమేష్, జగదీష్, ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత


చెక్కును అందిస్తున్న ఎమ్మెల్యే గోవిందరావు

పాతపట్నం, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): పార్టీలక తీతంగా అర్హతే ప్రాతిపదికగా సీఎంఆర్‌ఎఫ్ ద్వారా సాయం అందిస్తున్నట్టు ఎమ్మెల్యే మామిడి గోవిందరావు తెలిపారు. తన క్యాంపు కార్యాలయంలో రూ.1.40 లక్షల సీఎంఆర్‌ఎఫ్ చెక్కును లబ్ధిదారులు నారా లింగంనాయుడు కుటుంబానికి అందజేశారు. ఎల్ఎన్ పేట మండలం బొత్తడసింగి పంచాయతీ పూసాం గ్రామానికి చెందిన లింగంనాయుడి భార్య రమణమ్మ మెదడువాపు వ్యాధితో బాధపడుతుంది. ఈమె చికిత్స కోసం అవసరమైన ఆర్థిక సాయాన్ని ఎమ్మెల్యేను ఆశ్రయించారు. దీంతో సీఎం సహాయ నిధి ద్వారా రూ.1.40లక్షలు మంజూరు చేయించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.

● వజ్రపుకొత్తూరు, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): బాతుపురం గ్రామానికి చెందిన బత్తిని కామేశ్వరరావు కుమారుడు కిశోర్ అనారోగ్యంతో బాధపడుతూ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. తన ఆర్థిక పరిస్థితి ఎమ్మెల్యే గౌతు శిరీష దృష్టి తీసుకువచ్చాడు. దీంతో ఆమె స్పందించి సీఎం సహాయ నిధి ద్వారా రూ.3 లక్షలు మంజూరు చేయించారు. ఈ మేరకు బుధవారం ఆ చెక్కును బాధిత కుటుంబ సభ్యులకు అందించారు. కార్యక్రమంలో బాతుపురం మాజీ సర్పంచ్ బత్తిని మోహనరావు, యూనిట్ ఇన్‌చార్జ్ తామాడ ప్రదీప్, తెప్పల సింహాచలం, రెయ్య ప్రభాకర్ ఉన్నారు.

ఇచ్చిన హామీలు అమలు చేయండి



మాట్లాడుతున్న సీపీఎం నేత గోవిందరావు

టెక్కలి, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రప్రభుత్వం ఎన్నికలకు ముందు జిల్లాకు ఇచ్చిన హామీలను ఎందుకు అమలు చేయటంలేదని సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు, జిల్లా కమిటీ సభ్యులు ఎన్.షన్ముఖరావు ప్రశ్నించారు. స్థానిక పార్టీ కార్యాలయంలో కొల్లి ఎల్లయ్య అధ్యక్షతన బుధవారం జరిగిన సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. ఎన్నికల ముందు జిల్లాలో ఐటీడీఏ ఏర్పాటు చేస్తామని, జీడిపంటకు గిట్టుబాటు ధర కల్పిస్తామనిచెప్పారన్నారు. టెక్కలిలో 200 పడకల అసుపత్రిగా మార్చుతామని ఇచ్చిన మాటను మరిచారన్నారు. ప్రస్తుతం ఆసుపత్రిలో సిబ్బందితోపాటు మందులు కొరతతో రోగులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. సీపీఎం నాయకులు హెచ్.ఈశ్వర రావు, పి.సాంబమూర్తి, బి.వాసుదేవరావు, లక్ష్మణరావు,ధర్మారావు పాల్గొన్నారు.

ఎక్కువ మాట్లాడితే దరువులు తప్పవు

● వైస్ ఎంపీపీని హెచ్చరించిన తహసీల్దార్

● సభలో నివ్వెరపోయిన సభ్యులు



వేదికపై వైస్ ఎంపీపీని హెచ్చరిస్తున్న తహసీల్దార్ బాలకృష్ణ

కొత్తూరు, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): ఎక్కువ మాట్లాడితే దరువులు తప్పవు అంటూ తహసీల్దార్ కొప్పల బాలకృష్ణ పరుషపదజాలంతో వైస్ ఎంపీపీ తులసీ వరప్రసాదరావుని మండల సమావేశంలోనే హెచ్చరించడం పెద్ద దుమారం రేగింది. ఒకానొక దశలో కొట్లాటకు దారితీసే పరిస్థితి నెలకొనడంతో సభ్యులు, పోలీసులు కలగజేసుకోవడంతో సద్దుమణిగింది. వివరాల్లోకి వెళ్తే.. బుధవారం స్థానిక మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ సవర సావిత్రి అధ్యక్షతన జరిగింది. సమావేశం ప్రారంభానికి ముందు ఎంపీపీ నోట్ ఆర్డర్ అనుమతితో వైస్ ఎంపీపీ ఎల్.తులసీ వరప్రసాదరావు డాయాస్‌పై ఆహ్వానం మేరకు వచ్చి కూర్చున్నారు. ఇందుకు తహసీల్దార్ అభ్యంతరం తెలపడంతో వివాదం చెలరేగింది. ఇద్దరి మధ్య తీవ్రస్థాయిలో వాగ్వాదం జరిగింది. దీంతో పలువురు సభ్యులు కలగజేసుకొని తహసీల్దార్ తీరుపై మండిపడ్డారు. సభలో గలాట జరగడంతో తహసీల్దార్ తీరుపై సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేసి సమావేశం అనంతరం సభకు హాజరుకాని మండల అధికారులపై చర్యలకు తీర్మాణం చేశారు. కాగా వైస్ ఎంపీపీని తహసీల్దార్ హెచ్చరిస్తూ మాట్లాడిన వీడియో సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొడుతూ చర్చాంశనీయమైంది. రానున్న రోజుల్లో ఈ తగాదాలు ఏటు దారితీస్తాయోనని ప్రజల్లో నెలకొంది. ఇన్‌చార్జి ఎంపీడీవో బీవీ రాంప్రసాద్, పలువురు అధికారులు, సభ్యులు పాల్గొన్నారు.

కాస్త ఆగండి.. చల్లగాలి పడుతున్నా!

● ఏటీఎం గదిలో ఎద్దు



పలాస, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): 'చల్లగాలి కోసం వచ్చా. కాసేపటి తరువాత వచ్చి డబ్బులు తీసుకోండి' అన్నట్టుగా ఉంది కదూ ఈ చిత్రం. స్థానిక కేటీ రోడ్డు ఎస్‌బీఐ ఏటీఎం కేంద్రంలో మంగళవారం అర్ధరాత్రి దాటిన తరువాత రోడ్డుపై తిరుగాడే ఓ ఎద్దు తిష్ఠవేసి కూర్చుంది. అద్దాల తలుపులను నెట్టుకొని అందులోకి ప్రవేశించింది. బుధవారం ఉదయం ఏటీఎంలో నగదు తీయడానికి వెళ్లిన స్థానికులు ఈ విషయాన్ని గుర్తించి... బయటకు పంపించారు. నిత్యం ఆ ఎద్దు అక్కడే ఉంటుందని స్థానికులు చెబుతున్నారు. ఏటీఎంలకు ఎటువంటి సెక్యూరిటీ, పర్యవేక్షణ లేకపోవడంతో తరచూ ఇటువంటి సంఘటనలు చోటుచేసుకుంటున్నాయని స్థానికులు చెబుతున్నారు.

ఘనంగా నందన్న నిమజ్జనం


నందన్న గ్రామోత్సవంలో పాల్గొన్న భక్తులు

జలుమూరు, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): శ్రీముఖలింగం గ్రామంలోని దేవర వీధిలో ఏర్పాటు చేసిన నందన్న నిమజ్జనోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. గౌరీ నవరాత్రి ఉత్సవాలు ముగిసిన సందర్భంగా నంది వాహనంపై ఆశీనులైన పార్వతీ పరమేశ్వరులకు తొలుత గ్రామోత్సవం నిర్వహించారు. అనంతరం వంశధార నదిలో నిమజ్జనం చేశారు. మంగళ వాయిద్యాలు, కోయ డ్యాన్సులతో తిరువీధులు నిర్వహించారు. మహిళలు పార్వతీ పరమేశ్వరులకు మంగళ హారతులు ఇచ్చారు.

కాలిబాటలతో దోమపోటు నివారణ

నందిగాం, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): వరిలో దోమపోటును కాలిబాటు ద్వారా తగ్గించవచ్చునని రాగోలు వ్యవసాయ పరిశోధన కేంద్రం శాస్త్రవేత్త ఎం.శ్రీనివాస్ తెలిపారు. బుధవారం లగిదాసుపురంలో వరిసాగులో యాజమాన్య పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించారు జిల్లా వనరులు కేంద్ర వ్యవసాయాధికారి వై.సురేష్, ఏవో శ్రీకాంత్‌వర్మ తదితరులు ఉన్నారు.

విద్యార్థికి ఉపాధ్యాయుల ఆర్థిక సాయం

పోలాకి, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): ఈదులవలస ప్రాథమిక పాఠశాలలో ఒకటో తరగతి చదువుతున్న బొమ్మాలి జాన్ శామ్యూల్ ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. ఇతడి వైద్యానికి రూ.2లక్షలు ఖర్చు అవుతుందని వైద్యులు చెప్పగా, ఆ కుటుంబ ఆర్థిక పరిస్థితి తెలుసుకున్న మండలంలోని ఉపాధ్యాయులంతా తమ ఉదారతను చాటుకున్నారు. ఈ క్రమంలో తమ వంతుగా రూ103000 బుధవారం విద్యార్థి తల్లిదండ్రులు భాస్కరరావు, రమ్య ఎంఈవోలు శ్రీనివాసనాయక్, శ్రీనివాసరెడ్డి ద్వారా నగదు అందజేశారు. ప్రస్తుతం ఆ విద్యార్థి ఐసీయూలో చికిత్స పొందుతున్నాడని, ఆ కుటుంబాన్ని దాతలు ముందుకు వచ్చి ఆదుకోవాలని హెచ్ఎం పొన్నాన అరుణకుమారి కోరారు. వివరాలకు 9493577017 ఫోన్ నెంబరులో సంప్రదించాలని కోరారు.

వ్యవసాయాధికారిగా కిరణ్‌వాణి


ఏవో కిరణ్‌వాణి

ఎల్ఎన్ పేట, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): మండల వ్యవసాయాధికారిణిగా కిరణ్‌వాణి బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేసిన కె.సింహాచలం పాతపట్నం మండలానికి బదిలీపై వెళ్లారు. పాతపట్నం ఏవో గా పనిచేసిన కిరణ్‌వాణి బదిలీపై ఇక్కడకు వచ్చారు. నిత్యమూ రైతులకు అందుబాటులో ఉంటూ సేవలు అందిస్తానన్నారు.

16న డిగ్రీ కళాశాలలో జాబ్‌మేళా

టెక్కలి, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఈ నెల 16వ తేదీ గురువారం జాబ్‌మేళా నిర్వహించనున్నట్టు ప్రిన్సిపాల్ టి.గోవిందమ్మ తెలిపారు. కళాశాల జేకేసీ ఆధ్వర్యంలో దివీస్ లేబొరేటరీస్ లిమిటెడ్ వారిచే ఈ జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్టు తెలిపారు. డిగ్రీలో కెమిస్ట్రీ చదివినవారు ఒరిజినల్ ధ్రువపత్రాలతో ఉదయం 10గంటలకు హాజరుకావాలన్నారు.

మడపాంలో రచ్చబండ

నరసన్నపేట, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): మడపాం గ్రామంలో బుధవారం రాత్రి వైసీపీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ ఆధ్వర్యంలో రచ్చబండ కార్యక్రమం నిర్వహించారు. ప్రజా సమస్యలను తెలుసుకొని పరిష్కారానికి ప్రభుత్వంపై పోరాటం చేస్తామని ఆయన తెలిపారు. మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం మాట్లాడుతూ మద్యం కల్తీ వ్యవహారంపై ప్రభుత్వం రివర్స్ డ్రామా ఆడుతుందని, మెడికల్ కళాశాల ప్రైవేటుపరం చేసేందుకు పన్నాగం పన్నిందన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సీదిరి సార్.. ఏంటీ వ్యాఖ్యలు?

(ఏడో పేజీ తరువాయి)

అసభ్యకరంగా ప్రవర్తించారు. ఆయనపైనా మేము ఫిర్యాదు చేస్తాం. ఏం చర్యలు తీసుకుంటారో చూస్తాం. ఎస్పీకి తెలిసే ఇక్కడ అకృత్యాలు జరుగుతున్నాయి. ఆయన మా వ్యక్తిత్వాన్ని హననం చేస్తున్నారు. ఇలాంటి వ్యక్తులను పోలీసు బాస్‌లను చేస్తే ఇటువంటివే జరుగుతాయి. జగన్ సార్.. ఇటువంటి ఎస్పీలను కచ్చితంగా గుర్తుపెట్టుకోవాలి' అంటూ సీదిరి చిందులు తొక్కారు.

అప్పలరాజుతో సహా ఇద్దరిపై కేసు నమోదు..

మహిళా కానిస్టేబుల్, హోమ్‌గార్డుపై దాడి చేయడంతోపాటు అనుచితంగా వ్యవహరించారనే అభియోగంపై వైసీపీ సోషల్ మీడియా సభ్యుడు, ఆ పార్టీ కార్యకర్త వేణుగోపాలరెడ్డితో సహా మాజీ మంత్రి సీదిరి అప్పలరాజుపై బుధవారం కాశీబుగ్గ పోలీసులు కేసు నమోదు చేశారు. వేణుగోపాలరెడ్డిని అరెస్టు చేసి కోర్టులో హాజరుపరచి రిమాండ్‌కు తరలించారు. అప్పలరాజు ప్రోత్సాహంతో వేణుగోపాలరెడ్డి.. కానిస్టేబుల్‌పై దాడికి దిగారని అభియోగం ఉందని ఎస్‌ఐ నర్సింహమూర్తి తెలిపారు. కాగా, ఐదు రోజుల కిందట జరిగిన ఆందోళన కార్యక్రమం ఈ వ్యవహారానికి కారణమైంది. దీనికి సంబంధించి ఇప్పటికే 26 మంది వైసీపీ కార్యకర్తలపై పోలీసులు కేసు నమోదు చేశారు.

డిసెంబరు నాటికి సమీకృత కలెక్టరేట్

(ఏడో పేజీ తరువాయి)

ఎలివేషన్‌ను తక్షణమే పూర్తి చేయాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో డీఆర్వో ఎం.వేంకటేశ్వరరావు, ఆర్ అండ్ బీ ఎస్ఈ పి.సత్యన్నారాయణ, ఈఈ తిరుపతిరావు, కలెక్టరేట్ ఏఓ సూర్యనారాయణ, కాంట్రాక్టరు శ్రీరాం తదితరులు పాల్గొన్నారు.

జల్‌జీవన్ లక్ష్యాలను పూర్తి చేయాల్సిందే..

శ్రీకాకుళం కలెక్టరేట్, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): జిల్లాలో జల్‌జీవన్ మిషన్ లక్ష్యాలను పూర్తి చేయాల్సిందేనని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో బుధవారం సమీక్ష నిర్వహించారు. జిల్లాలో మొత్తం 4,87,307 ఇళ్లకు కుళాయి కనెక్షన్లు ఇవ్వాల్సి ఉండగా, ఇప్పటి వరకు 2,29,649 కనెక్షన్లు ఇచ్చామని, ఇంకా 2,57,658 పూర్తి చేయాల్సి ఉందని అధికారులు వివరించారు. మిగిలిన పనులు వేగవంతం చేసి, మండలాల వారీగా ప్రణాళికలు సిద్ధం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలో ఇప్పటి వరకు 29 గ్రామాలు హర్ ఘర్ జల్ డిక్లరేషన్ సాధించాయని, ఈ డిసెంబర్ నాటికి మరో 178 గ్రామాలను ఈ జాబితాలో చేర్చడమే లక్ష్యంగా ప్రత్యేక చర్యలు చేపడతామని అధికారులు వివరించారు.

స్ఫూర్తిప్రదాత అబ్దుల్ కలాం

భారతరత్న డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం జీవితం నేటి యువతరానికి ఒక ప్రేరణ, ఆయన అందరికీ ఆదర్శప్రాయులని వక్తలు అన్నారు. మాజీ రాష్ట్రపతి డాక్టర్ కలాం జయంతి సందర్భంగా బుధవారం జిల్లాలో పాఠశాలలు, కార్యాలయాలు, సంస్థల్లో ఆయన విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. దేశాభివృద్ధిలో ఆయన చేసిన సేవలను కొనియాడారు. కలాం చూపిన మార్గంలో యువత ముందుకు సాగాలని వారు ఆకాంక్షించారు.

-ఆంధ్రజ్యోతి బృందం



శ్రీకాకుళం క్రైం: కార్యాలయంలో అబ్దుల్ కలాం చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న ఎస్పీ



ఎచ్చెర్ల: బీఆర్ఏయూలో అబ్దుల్ కలాం విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న వీసీ రజని



పలాస/రూరల్: కోర్టులో కలాం చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న న్యాయాధికారి మాధురి

న్యాయసేవలు అందించడంలో సహకరించండి

● జిల్లా ప్రధాన న్యాయాధికారి జునైద్ అహ్మద్ మౌలానా

శ్రీకాకుళం లీగల్, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): ప్రజలకు న్యాయసేవలు అందించడంలో సహకరించాలని జిల్లా ప్రధాన న్యాయాధికారి జునైద్ అహ్మద్ మౌలానా అన్నారు. జిల్లా న్యాయాధికార సంస్థ కార్యాలయంలో బుధ వారం పారాలీగల్ వలంటీర్లకు నాలుగు రోజుల శిక్షణ కార్యక్రమం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. ప్రజలకు న్యాయ విజ్ఞానం అందించడంలో కీలకంగా పనిచేయాలన్నారు. తొలిరోజు నల్సా అందిస్తున్న వివిధ పథకాలను వివరించారు. బాల్య వివాహాల నిషేధిత చట్టం, ఆస్తి చట్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.హరిబాబు, న్యాయవాది అన్నెపు భువనేశ్వరరావు, జిల్లా బాలల రక్షణ అధికారి కేవీ రమణ తదితరులు పాల్గొన్నారు

ఉపాధి' నిధులతో అభివృద్ధి

గార, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం వలసల నివారణకు గాను నిర్వహిస్తున్న ఉపాధి హామీ పథకం గ్రామాల్లో అభివృద్ధికి దోహదపడుతోందని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయం వద్ద ఉపాధి హామీ సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు. ఉపాధి పనుల్లో ఎక్కడైనా చిన్న పొరపాట్లు ఉంటే వాటిని అధికారులు సరిదిద్దే చర్యలు తీసుకోవాలన్నారు. అలాగని పారదర్శకత లోపిస్తే సహించేది లేదని స్పష్టం చేశారు. అంతకుముందు కె.మత్స్యలేశం బీచ్‌లో జీఎస్టీపై అవగాహనా ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా పర్యాటక శాఖాధికారి ఎన్.నారాయణరావు, ఏఎంసీ మాజీ చైర్మన్ పీస వెంకట రమణమూర్తి, టీడీపీ నాయకుడు బడగల వెంకటప్పారావు, స్థానిక నేత బుడ్డా ఎర్రన్న, ఎంపీడీవో ఇ.రఘు, తహసీల్దార్ ఎం.చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌యూబీ పనులు ప్రారంభించండి

ఇచ్ఛాపురం/కంచిలి, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): ఇచ్ఛాపురం నుంచి శ్రీకాకుళం రోడ్డు వరకు మంజూరైన ఆర్‌యూబీ పనులను ప్రారంభించేందుకు చర్యలు తీసుకోవాలని జడ్‌ఆర్‌యూసీసీ సభ్యుడు శ్రీనివాస్ రౌళో కోరారు. ఈ మేరకు బుధవారం డీఆర్ఎం కార్యాల యంలో ఖుర్దారోడ్ డీఆర్ఎం అలోక్ త్రిపాఠి, సీనియర్ డివిజనల్ ఇంజనీర్ అభిషేక్, సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ అభికుమార్‌లను కలిసి వినతిపత్రాలను అందించారు. అలాగే ఇచ్ఛాపురం, జాడుపూడి, బారువ, మందస స్టేషన్‌లలో ప్రధాన రైళ్లకు హాల్టింగ్ కల్పించాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకుడు సదానంద రౌళో తదితరులు పాల్గొన్నారు.

దేశీయ ఉత్పత్తులు ఉపయోగించాలి: అశోక్



రైతుబంధు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అశోక్

కంచిలి, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): రసాయనిక ఎరువులు వినియోగించకుండా సేంద్రియ పద్ధతుల్లో పండించే స్వదేశీ ఉత్పత్తులను విని యోగించాలని, తద్వారా దేశాభివృద్ధి సాధించడమే కాకుండా ఆరోగ్యంగా ఉంటామని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బెందాళం అశోక్ అన్నారు. కంచమ్మతల్లి ఫార్మర్ ప్రొడ్యూసర్ కంపెనీ ఆధ్వర్యంలో చేపట్టిన రైతుబంధు కార్యక్రమం బుధవారం నిర్వహించారు. సేంద్రియ పద్ధతుల్లో గిరిజనులు పండించిన పంటలను విక్రయించేందుకు ఏర్పాటు చేసిన ఇటువంటి స్టాల్స్ వల్ల ఎంతో మేలు జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఎఫ్‌పీస్ చైర్మన్ కృష్ణారావు, డైరెక్టర్స్ రాజేశ్వరి, అనూష, వల్లభరావు, శ్రీకాంత్, నైరా ప్రొఫెసర్ సృజన, టీడీపీ నాయకులు మాదిన రామారావు, జగదీష్ పట్నాయక్, బంగారు కురయ్య, పి.రామారావు, ఆనంద్ పాల్గొన్నారు.

'సిక్కోలు పుస్తక మహోత్సవం' విజయవంతం కావాలి



లోగోను ఆవిష్కరిస్తున్న జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్

గుజరాతీపేట, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని ఏడురోడ్ల కూడలి ఎన్టీఆర్ మున్సిపల్ మైదానంలో నవంబరు 11 నుంచి 20వ తేదీ వరకు నిర్వహించనున్న సిక్కోలు పుస్తక మహోత్సవం విజయవంతం కావాలని జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ ఆకాంక్షించారు. బుధవారం సంబరాల లోగోను తన చాంబర్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో ఇటువంటి కార్యక్ర మాలు చేపట్టడం అభినందనీయ మన్నారు. ఉత్సవ నిర్వాహకులు కె.శ్రీని వాసు, పి.సుధాకర్, జి.గిరిధర్ మాట్లాడుతూ.. సిక్కోలు పుస్తక మహోత్స వానికి జిల్లా యంత్రాంగం సహకరిస్తోందని, భవిష్యత్‌లోనూ దీనిని కొన సాగించాలని కోరారు. ఇ.కామినాయుడు, దొంతం పార్వతీశం, కె.కూర్మారావు, పి.గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

వెన్ను.. దన్ను

(ఏడో పేజీ తరువాయి)

ఆరోగ్యాన్ని ప్రభావితం చేస్తుంది. దీని వల్ల తీవ్రమైన నొప్పి వంటి సమస్యలు కలుగుతాయి.

ఆస్టియోపోరోసిస్..

ఎముకలను బలహీన పరిచే ఒక పరిస్థితి. దీని వల్ల అవి పగుళ్లకు గురయ్యే అవకాశం ఉంటుంది. బోలు ఎముకల వ్యాధి వెన్నెముక పగుళ్లు, వెన్నుపాము గాయాలకు దారి తీయవచ్చును. ప్రధానంగా రుతుక్రమం ఆగిపోయిన మహిళల్లో ఆస్టియోపోరోసిస్ వ్యాధి వచ్చే అవకాశం ఉందని వైద్యులు చెబుతున్నారు.

జిల్లాలో పరిస్థితి ఇలా..

జిల్లాలో వెన్నెముక సమస్యలతో ఆస్పత్రులకు వెళ్లే వారి సంఖ్య రోజురోజుకీ పెరుగుతోంది. ఇటు ప్రభుత్వ, అటు ప్రైవేటు ఆసుపత్రుల్లో రోగుల తాకిడి ఎక్కువ అవుతోంది. రోజుకు వందకు పైగా కేసులు వెన్నెముక సంబంధిత సమస్యలతో వస్తున్నాయని వైద్యులు చెబుతు న్నారు. ఎక్కువగా యువతే వీటి బారిన ప డుతుండడం గమనార్హం. ఉద్యోగాల్లో ఎక్కువ సేపు కంప్యూటర్ల ముందు కూర్చుని పనిచేయడం, సెల్‌ఫోన్ వినియోగం, బైకులపై అధిక దూరాలు ప్రయాణం చేయడం... మారుతున్న జీవన విధానం వల్ల వెన్నెముక సంబంధిత సమస్యలు పెరుగుతున్నాయని వైద్యులు చెబుతున్నారు.

లక్షణాలు..

వెన్ను లేదా మెడలో నిరంతర నొప్పి, ఒక చోట నిలబడలేకపోవడం, భుజాలు, చేతులు, లేదా కాళ్లు మొద్దుబారడం, వంగేటప్పుడు నొప్పి వంటి లక్షణాలు ఉంటాయి.

ఆధునిక వైద్య చికిత్సలు ఇవే..

ఫిజియోథెరపీ ద్వారా వెన్నెముక కండరాలను బలపరచవచ్చును. అలాగే వెన్నుపూసలు దెబ్బతిన్నప్పుడు వైద్య నిపుణులతో పెద్ద కోతలు లేకుండా లేజర్ లేదా మైక్రో సర్జరీలతో చికిత్స చేస్తారు. పెయిన్ మేనేజ్‌మెంట్ థెరపీ, ఆయుర్వేదం, యోగా వంటి చికిత్సలు ఫలప్రదంగా ఉన్నాయని వైద్యులు చెబుతున్నారు.

రిమ్స్‌లో ప్రత్యేక శస్త్ర చికిత్సలు..



రిమ్స్‌లో ప్రత్యేక చికిత్సలు అందుబాటులో ఉన్నాయి. అత్యంత అధు నాతన ప్లాస్మా రిచ్ ప్రెసిపిటెంట్ (పీఆర్పీ) చికిత్సను కూడా ఉచితంగా చేస్తున్నాం. దీంతో తక్షణ నివారణ, ఉపశమనం కలుగుతుంది. వెన్నుపూసకు సంబంధించి డిస్కెక్టమీ, స్పైనల్ స్టెబిలైజేషన్ సర్జరీలు కూడా నిర్వహిస్తున్నాం. ప్రభుత్వం పరికరాలు సమకూరిస్తే ఎండోస్కోపిక్ సర్జరీలు కూడా ఇక్కడే నిర్వహించ గలుగుతాం. ప్రజలు ఈ సేవలను విని యోగించుకోవాలి.

-డాక్టర్ ఎం.పార్థసారథి, ప్రొఫెసర్ ఇన్ ఆర్థోపెడిక్స్, రిమ్స్ ఆసుపత్రి, శ్రీకాకుళం

చోరీపై కేసు నమోదు

శ్రీకాకుళం రూరల్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): నందగిరిపేటలో తాళం వేసిన ఇంట్లో చోరీ జరిగినట్లు ఫిర్యాదు వచ్చినట్లు రూరల్ ఎస్ఐ కె.రాము తెలిపారు. ఆయన తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. భార్యాభర్తల మధ్య గొడవ జరిగి భర్త సువారి వరహాలనాయుడు బయటకు వెళ్లిపోయాడు. అతని భార్య కన్నవారింటికి ఈ నెల 14న వెళ్లింది. అదేరోజు రాత్రి భర్త ఇంటికి వచ్చి చూడగా తాళం వేసి ఉండడంతో బంధువుల ఇంటి వద్ద భోజనం చేసి అక్కడే నిద్రపోయి బుధవారం ఉదయం ఇంటికి వెళ్లాడు. అయితే ఇంటి తాళం పగుల గొట్టి ఉండడంతో పాటు బీరువా తెరిచి ఉంది. రెండు తులాల బంగారు తాడు, అరతులం 2 ఉంగరాలు, 15 తులాల వెండి వస్తువులు పోయినట్లు గుర్తించారు. వరహాల నాయుడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

పేకాట స్థావరంపై పోలీసుల దాడి

ఆమదాలవలస, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): తోటాడ గ్రామంలో నిర్వహిస్తున్న పేకాట స్థావరంపై బుధవారం శ్రీకాకుళం టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడి చేశారు. ఈ దాడిలో పేకాట ఆడుతున్న 9 మందిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.5060 నగదు స్వాధీనం చేసుకొని ఆమదాలవలస పోలీసులకు అప్పగించారు. 9 మందిపై కేసు నమోదు చేసినట్టు పోలీసులు తెలిపారు.

జీఎస్టీ తగ్గింపుతో పేదలకు మేలు: కలిశెట్టి



కోష్టలో దుకాణాన్ని సందర్శించిన ఎంపీ కలిశెట్టి

రణస్థలం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): ఎన్‌డీఏ ప్రభుత్వం తీసుకువచ్చిన జీఎస్టీ సంస్కరణలతో పేదలకు మేలు జరిగిందని విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు అన్నా రు. కూటమి నాయకులతో కలిసి బుధవారం కోష్ట జంక్షన్‌లో దుకాణాన్ని సందర్శించారు. నిత్యావసర సరకులపై జీఎస్‌టీ స్లాబ్‌లు తగ్గించటం వల్ల ప్రతి కుటుంబానికి రూ.15 వేలు ఆదా అవుతుందన్నారు. కార్యక్రమంలో కూటమి నేతలు పిషిని జగన్నాథం నాయుడు, లంక శ్యామలరావు, పిన్నింటి భానోజీనాయుడు తదితరులు పాల్గొన్నారు.

పేదలకు ఉపయోగం: శంకర్

గార, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): కళింగపట్నంలో జీఎస్టీ రేట్ల తగ్గింపుపై అవగాహన కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రూపొందించిన సైకత శిల్పాన్ని ఎమ్మెల్యే శంకర్ ఆవిష్కరించారు. జీఎస్టీ తగ్గింపుతో సామాన్యులకు ఊరట కలిగిందన్నారు. ● మత్స్యకారుల సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. బుధవారం మొగదలపాడు, శ్రీకూర్మం, బలరాంపురం గ్రామాల్లో మత్స్యకారులకు నైలాన్ వలలు, బోట్ల ఇంజన్లు పంపిణీ చేశారు. పలువురు మత్స్యకారులు పాల్గొన్నారు.



జీఎస్టీపై తయారు చేసిన సైకత శిల్పాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే గొండు శంకర్

హక్కులపై అవగాహన ఉండాలి

జి.సిగడాం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): బాలికలు తమ హక్కులపై అవ గాహన కలిగి ఉండాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ తమ్మినేని లక్ష్మి అన్నారు. బుధవారం గెడ్డకంచరాంలో పోషణ మాసం కార్యక్రమం నిర్వహించారు. సర్పంచ్ లలిత కుమారి, తదితరులు పాల్గొన్నారు.

ఉజ్వల భవిష్యత్ పొందాలి

సరుబుజ్జిలి, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): బాలికలు బాగా చదువుకుని ఉజ్వల భవిష్యత్ పొందాలని వెన్నెలవలస గిరిజన ఆశ్రమ పాఠశాల హెచ్‌ఎం బి.ఉమ అన్నారు. బాలికా దినోత్సవాన్ని బుధవారం నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎం.జానకిలక్ష్మి పాల్గొన్నారు.

గజలక్ష్మి అమ్మవారి చీర రూ.లక్ష

ఇచ్ఛాపురం, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): రత్తకన్న గ్రామం నాయుడు వీధిలో తొమ్మిది రోజులుగా నిర్వహిస్తున్న గజలక్ష్మీ అమ్మవారి నవరాత్రి ఉత్సవాలు ముగిశాయి. ఈ సంద ర్భంగా అమ్మవారు ధరించిన చీరను బుధవారం వేలం వేశారు. పలువురు భక్తులు వేలం పాటలో పాల్గొనగా గ్రామానికి చెందిన దల్లి బిసాయ్, గాయత్రి బిసాయ్ దంపతులు రూ.1.02 వేలకు సొంతం చేసుకున్నారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు

'స్వచ్ఛ' అవార్డు పొందిన హెచ్‌ఎంకు అభినందన

శ్రీకాకుళం కలెక్టరేట్, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్వచ్ఛ ఆంధ్ర-2025 అవార్డు పొందిన నేలబొంతు ఆశ్రమ పాఠశాల హెచ్‌ఎం బి.విజయ భారతిని బుధవారం కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అభినందించారు. ఈనెల 6న విజయవాడలో ఆమె అవార్డును సీఎం చంద్రబాబునాయుడు చేతులమీదుగా స్వీకరించిన సంగతి తెలిసిందే. హెచ్‌ఎంను స్ఫూర్తిగా తీసుకుని జిల్లాను స్వచ్ఛ శ్రీకాకుళంగా తీర్చిదిద్దేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయా లని కలెక్టర్ అన్నారు. కార్యక్రమంలో జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, గిరిజన సంక్షేమ శాఖ డీడీ అన్నాదొరై తదితరులు పాల్గొన్నారు.

సంప్రదాయ కళలను ప్రోత్సహించాలి: రవికుమార్



నృత్య కళాకారిణులు శ్రీలత, చిన్నారులను అభినందిస్తున్న ఎమ్మెల్యే రవికుమార్

ఆమదాలవలస, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): సంప్రదాయ కళలైన సంగీతం, నృత్యం, జానపదాల వంటి వాటిని ప్రోత్సహించాలని ఎమ్మెల్యే కూన రవికుమార్ అన్నారు. కూచిపూడి నత్యరూపకర్త, పద్మభూషణ్ డాక్టర్ వెంపటి చినసత్యం 96వ జయంతిని బుధవారం స్థానిక ఎస్ఎస్ఎన్ కల్యాణ మండపంలో నిర్వ హించారు. వెంపటాపు సత్యం, భారతరత్న అబ్దుల్ కలాం చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం నాట్యశ్రీ నృత్య కళా నికేతన్ చిన్నారుల నృత్యాభినయం ఆకట్టుకుంది. సంస్థ నిర్వాహకురాలు కూన శ్రీలతతో పాటు చిన్నారులను అభినందించారు. మందపల్లి రామ కృష్ణారావు అబ్దుల్ కలాం జీవితంపై రచించిన మహామనీషి పుస్తకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో జనసేన సమన్వయకర్త పేడాడ రామ్మోహన్‌రావు, సామాజికవేత్త బాడాన దేవభూషణరావు, రోటరీ క్లబ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వీటీ చౌదరి, జె.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ఉపాధి కల్పనలో భాగస్వామ్యం కావాలి

పొందూరు, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): యువతకు ఉద్యోగ, ఉపాధి కల్పనలో ప్రభుత్వంతో స్వచ్ఛంద సంస్థలు భాగస్వామ్యం కావాలని ఎమ్మెల్యే కూన రవికుమార్ అన్నారు. 'ఆడపిల్ల సేవా సొసైటీ' ఆధ్వర్యంలో యువతకు వివిధ ఉద్యోగాల కోసం నిమిత్తం ఏర్పాటు చేసిన ఉచిత కోచింగ్ సెంటర్‌ను బుధవారం ప్రారం భించారు. కార్యక్రమంలో ఎంపీడీవో వాసుదేవరావు, సర్పంచ్ ఆర్.లక్ష్మి, పీఏసీఎస్ అధ్యక్షుడు వండాన మురళి, టీడీపీ నాయకులు సీపాన శ్రీరంగ నాయకులు, బలగ శంకర భాస్కర్, అనకాపల్లి చినరంగ, బాడాన గిరి తదితరులు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

ఇంటి నిర్మాణం ప్రారంభం



ఇంటి నిర్మాణం చేపడుతున్న దృశ్యం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

పొందూరు, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): స్థానిక వాండ్రంగి వీధికి చెందిన యాచకు రాలైన అంధురాలు కొమరాపు తవిటమ్మ ఇంటి నిర్మాణాన్ని అధికారుల ఆదేశాలతో స్థానికు లు ప్రారంభించారు. గతనెల 23న 'అంధురాలిపై కనికరం లేదా?' శీర్షికతో 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన కథనానికి కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి స్పందించి.. సమస్యను పరిష్కరించి ఇంటి నిర్మాణం చేయించాలని మండల అధికారులను ఆదేశించారు. దీంతో వారి సూచనల మేరకు వీధివాసులు ఇంటి నిర్మాణం ప్రారంభించారు.

మందుగుండు స్వాధీనం

సోంపేట, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): స్థానిక పల్లివీధిలో అక్రమంగా నిల్వ ఉంచిన మందుగుండు సామాన్లను బుధవారం ఎస్ఐ వి.లోవరాజు ఆధ్వర్యంలో స్వాధీనం చేసు కున్నారు. ఢిల్లీ అనే వ్యక్తి ఎటువంటి అనుమతులు లేకుండా నిలువ ఉంచాడని, వీటి విలువ రూ.10,4450 ఉంటుందని ఆయన పేర్కొన్నారు.